
# గురుశిష్యులు

ఇలపావులూరి
మురళీ మోహనరావు



అద్దంకి నుంచి తిరుపతికి బయలుదేరవలసిన బస్సు అరగంట ఆలస్యంగా నిండుగర్భిణిలా కదిలింది. అరవైమంది కూర్చుంటే, మరో అరవైమంది నిలుచున్నారు.

బస్సు మధ్యభాగంలో కూర్చుని ఉన్నాడు సురేష్. ఆర్టీసీ బస్సులో సీటు దొరకడం అంటే, 'కర్ర ఉన్నవాడిదే బర్రె'లాంటిది. బస్సు డిపోలో నుంచి ప్లాట్‌ఫామ్ దగ్గరకు వస్తూండగానే ఉరుకులు పరుగులతో దాని రెండువైపులా ఎగురుతూ కిటికీల్లోంచి రుమాళ్లు, తువ్వాళ్లు, పంచులు సీట్లలోకి విసిరేస్తారు. ఎవరి వస్తువు ఏ సీట్లో పడితే ఆ సీట్లో వారు బస్సు కదిలేవేళకు వచ్చినా దర్జాగా కూర్చోవచ్చు.

అలా వెయ్యటం తప్పని ఎవరైనా వారిస్తే, పెద్దా చిన్నా భేదం లేకుండా తన్నబోతారు. అందరిదీ ఒకే అలవాటు కాబట్టి సాధారణంగా ఎవరూ పోట్లాట పెట్టుకోరు. ఇక ఆ బస్సుల్లో కండబలం ఉన్నవాడు తప్పించి స్త్రీలు, వృద్ధులు, పిల్లలు ఎక్కడం అసాధ్యం. ఎక్కినా, నిలుచోవలసిందే! కండక్టరు, డ్రైవరు టిక్కెట్లలో చిల్లర మిగుల్చుకుంటూంటారు కాబట్టి వారు ఈ సీట్ల పందాలలో ఏమాత్రం జోక్యం చేసుకోరు.

సురేష్ కూడా పదిమంది అసహాయ వృద్ధులను వెనక్కు తోసివేసి బస్సులో దూరడంతో మధ్యభాగంలో సీటు లభించింది. స్త్రీలు, వృద్ధులు దాదాపు అందరూ నిలుచునే ఉన్నారు.

చంటిపిల్లలను చంకనెత్తుకున్న స్త్రీల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై పసికందులు రోదిస్తున్నారు. అయినా ఎవ్వరూ జాలిపడటంలేదు.

రోడ్డంతా గతుకులమయం కావడంతో బస్సు ఎగిరెగిరి పడుతున్నది. పైన పట్టుకున్న హేండిల్ వదలలేక, పసికందులను కాస్త అటూ ఇటూ కదిలించే సౌలభ్యం లేక తల్లులు నరకం అనుభవిస్తున్నారు.

'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం. వారికి కేటాయించిన సీట్లను వారికే వదిలేద్దాం!'లాంటి నినాదాలు గ్రామాల్లో తిరిగే బస్సుల్లో పనిచెయ్యవు.

కండక్టరు మాత్రం పద్మవ్యూహంలో జొరబడి, కురుయోధులను పదునైన శస్త్రాలతో కూల్చిపారేస్తున్నట్లు ప్రయాణీకులను నెట్టుకుంటూ టిక్కెట్లు కొడుతూ ముందుకు సాగుతున్నాడు. 'దిగేటప్పుడు చిల్లర తీసుకో'మని చెబుతున్నాడు. కొందరైనా మర్చిపోకుండా ఉంటారా అని అతగాడి ఆశ.

తన ముఖానికి ఏదో సంచి తగలడంతో తలెత్తి చూశాడు. డెబ్బై సంవత్సరాల వృద్ధుడు చెమటలు కక్కుతూ నిలుచున్నాడు. సంచీలో ఏవో సీసాలున్నాయి. కొద్దిగా కాలు కదల్చడంతో ఆ సంచి సురేష్ ముఖానికి తగిలింది.

"ఏమయ్యోయ్, పెద్దాయనా! సంచిని కాస్త పైకెత్తి పట్టుకో. నా ముఖానికి తగులుతున్నది!" కోపంగా అన్నాడు సురేష్.

వృద్ధుడు తలను కొంచెం కిందికి దించి, సురేష్‌ను చూశాడు. "పొరపాటైంది, క్షమించండి బాబూ!" అన్నాడు.

ఆ క్షణంలో వృద్ధుడిని చూసిన సురేష్‌కు ఏదో జ్ఞాపకమొచ్చింది.

సందేహం లేదు ... పాతిక సంవత్సరాల క్రితం తనకు ఏడో తరగతిలో పాఠాలు చెప్పిన రామ్మూర్తి పంతులే! ఒక్క క్షణం మనసులో ఝల్లుమంది. తాను తరచుగా క్లాసులు ఎగ్గొడుతుంటే చింతబరికెతో బాదుతుండేవాడు. అత్తెసరు మార్కులతో సెవెన్త్ క్లాస్ పాసయినాడంటే ఒకవిధంగా ఆయన పెట్టిన భయంవల్లనే.

పలకరించబోయాడు. 'మాస్టారూ ...' అన్న పదం గొంతువరకూ వచ్చి ఆగిపోయింది. తాను పలకరించి, ఆయన గుర్తుపట్టాడంటే తను లేచి ఆయనను కూర్చోమనాలి. బస్సంతా కిక్కిరిసి ఉన్నది. పైగా ఎండాకాలం.

లేవాలా, వద్దా అని అయిదు నిముషాలు తర్జనభర్జనలు పడ్డాడు. నెల్లూరు వరకు అంటే నాలుగైదు గంటల ప్రయాణం. మరి ఆయనెక్కడదాకా వెళ్లాలో? ఈ రష్‌లో లేచి మరొకరికి సీటు ఆఫర్ చేయడంకంటే తెలివితక్కువతనం మరొకటి ఉండదని అంతరాత్మ హెచ్చరిస్తున్నది.

పోనీ ..., ఆయన తనను గుర్తుపట్టి ఉంటాడా? నో.... నెవ్వర్... దానికి అవకాశం లేదు. అప్పుడెప్పుడో పాతిక సంవత్సరాల క్రితం పసితనపు ముఖంలో చూశాడు. కానీ నేడు పెద్దపెద్ద మీసాలు, మేరువులా పెరిగిన శరీరం ... ఇన్‌షర్టు ... నో.... గుర్తుపట్టే వీలు ఏమాత్రం లేదు.

ఎప్పుడైనా శిష్యులు గురువులను గుర్తించాల్సిందే కానీ శిష్యులను గురువులు గుర్తించడం అసంభవం! ఆయన కూడా మళ్లీ ఇటు చూడలేదు. తను కూడా ఇక ఆయనవైపు చూడకూడదు.

కండక్టరు అందరినీ విసుక్కుంటూ టిక్కెట్లిస్తున్నాడు. ఆయన కూడా నెల్లూరు వరకూ టిక్కెట్టు తీసుకున్నాడు.

చచ్చాం పో! ఇక అంతవరకూ తల పైకెత్తి చూడకూడదన్నమాట! అంతవరకూ సిగరెట్లు కూడా తాగడానికి వీల్లేదన్నమాట! ఎంతైనా మనసులో నైతికంగా గౌరవం అనేది ఉంటుంది కదా!

వృద్ధుడు నానా అవస్థా పడుతూ ఎవరైనా ఒక్క అంగుళమైనా జరిగి కూర్చోమంటారేమోనని ఆశగా అటూ ఇటూ చూడసాగాడు.

ఊహుఁ... ముసలాణ్ణి కూర్చోమనడానికి ఎవరికీ ప్రాణమొప్పడంలేదు. సురేష్ కనుకొసల నుంచి వృద్ధుడిని గమనించసాగాడు. ఆయన అసలు తనవైపు చూడటమేలేదు. హమ్మయ్య! తనను గుర్తుపట్టలేదన్నమాట!

దారిలో బస్సు ఆగిన ప్రతిచోటా నలుగురు దిగితే, ఎనిమిదిమంది ఎక్కుతున్నారు. అయినా సరే, ఆర్టీసీ వారు ప్రతి ఏటా కోట్లాది రూపాయలు నష్టమొచ్చిందని వాపోతూంటారు.

నాలుగు గంటల ప్రయాణం తరువాత నెల్లూరు వచ్చింది. దాదాపు పాతికమంది దిగారు.

వృద్ధుడు డ్రైవర్ కాబిన్ నుంచి ఒక బస్తా బయటకు లాగాడు. సురేష్ దిగబోతుండగా, "కొంచెం సాయపడతారా బాబూ?" అన్నాడు.

బస్తాను దించిన తర్వాత వృద్ధుడు అడిగాడు —"అమ్మా, నాన్నా బాగున్నారా?"

ఖంగుతిన్నాడు సురేష్. "మీరు ... మీరు ..." ఇంకా గుర్తుపట్టనట్లు నటిస్తూ అన్నాడు.

"నన్ను రామ్మూర్తి పంతులు అంటార్లే! మీ నాన్నగారూ, నేనూ కలిసి ఒకే స్కూల్లో పనిచేశాం. ఆరో క్లాసు, ఏడో క్లాసులో మీరు నా శిష్యులు. మా అమ్మాయి కూడా నీతోపాటే చదివేది. ప్రస్తుతం అమ్మాయి ఇక్కడే పనిచేస్తున్నది. రిటైరైనప్పటినుంచి అమ్మాయి దగ్గరే ఉంటున్నాను. అద్దంకిలో కొంత పొలం ఉన్నది. మూణ్ణెల్లకోసారి వెళ్లి కౌలుదారు ఇంటినుంచి ఒక బస్తా తెస్తుంటాను. సొంత పొలంలో పండినవి కదా! ఇంతకూ మీరేం చేస్తున్నారిప్పుడు?"

సురేష్ సిగ్గుతో కుంచించుకుపోయాడు. మలేరియా వచ్చినవాడిలా వణుకుతున్నాడు.

"కలెక్టరేట్‌లో .... అటెండర్‌గా ... మరి మీ అమ్మాయి ... లావణ్య ..." కంపిస్తున్న స్వరంతో అతి కష్టమ్మీద అన్నాడు.

"అమ్మాయి కూడా కలెక్టరేట్‌లోనే పనిచేస్తున్నది. కలెక్టర్‌గా...!" రిక్షా ఎక్కుతూ చెప్పాడు రామ్మూర్తి.

సురేష్‌కు స్పృహ తప్పింది.

■

"ఏంటోయ్, లెటర్ రాస్తున్నావు ఎవరికి?" అడిగాడు మెంటల్ డాక్టర్ ఓ పిచ్చివాడిని.

"నాకే!"

"ఏమని రాసుకుంటున్నావు?"

"ఏమో, నాకేం తెలుసు? ఇది నాకు రేపు కదా అందేది!"

? ? ? !

— కలపర్తి సత్యం (ఏలూరు)